బల్కంపేట ఎల్లమ్మకు పుష్పాలంకరణ



పుష్పాలతో అలంకరించిన బల్కంపేట ఎల్లమ్మ

అమీర్‌పేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ సమయం దగ్గర పడుతున్న కొద్దీ రోజురోజుకు భక్తుల తాకిడి అధికమవుతోంది. ఇప్పటికే అనేకమంది భక్తులు ప్రైవేట్ రూంలు బుక్ చేసుకున్నారు. మంగళవారం అమ్మవారిని పుష్పాలతో అలంకరించారు. గర్భగుడిలో దేదీప్యమానంగా వెలుగొందుతున్న అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించేందుకు వేలాదిగా భక్తులు తరలివస్తున్నారు. దీంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. శివసత్తుల పూనకాలు, డప్పు సప్పుళ్లతో బోనాలు ఎత్తుకుని వస్తున్న భక్తులతో ఆలయం ముందు ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.



ఎమ్మెల్యే తలసానికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, నర్సింహ

అన్నదాతల సేవలు వెలకట్టలేనివి: మంత్రి తలసాని

అమీర్‌పేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లమ్మ అమ్మవారి కల్యాణం తిలకించేందుకు తరలివచ్చే భక్తుల ఆకలి తీరుస్తున్న బల్కంపేటవాసుల సేవలు వెలకట్టలేనివని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యదవ్ అన్నారు. ఈ నెల 9న అమ్మవారి కల్యాణాన్ని పురస్కరించుకుకి అన్నదాన నిర్వాహకుడు, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కూతురు నర్సింహ మాజీ కార్పొరేటర్ శేషుకుమారితో కలిసి తలసానిని ఆయన నివాసంలో మంగళవారం కలిసి అన్నదాన కార్యక్రమానికి ఆహ్వానించారు. కార్యక్రమంలో హన్మంతరావు, వనం శ్రీనివాస్, కట్ట బలరాం, సంతోష్ కుమార్ ఉన్నారు.



బస్తీసభలో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, తహసీల్దార్ నయీముద్దీన్, ఆర్‌ఐ కిరణ్

డబుల్ ఇళ్ల లబ్ధిదారుల పత్రాల పరిశీలన

యూసుఫ్‌గూడ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): 'మా ఇళ్లు మాకు ఇప్పించండి సారూ' అంటూ మొరపెట్టుకుంటున్న కమలానగర్ డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులకు కాస్త ఊరట లభించింది. మంగళవారం ఖైరతాబాద్ తహసీల్దార్ నయాముద్దీన్, ఆర్‌ఐ కిరణ్‌తో కలిసి స్థానిక కార్పొరేటర్ సీఎన్ రెడ్డి కమలానగర్‌లో బస్తీసభ నిర్వహించారు. ఇక్కడ నిర్మించిన ఇళ్లను ఇప్పటికే వందమందికి కేటాయించగా మరో 44మందికి ఇవ్వాల్సి ఉంది. అయితే, లబ్ధిదారుల అభ్యర్థన మేరకు అధికారులు లబ్ధిదారుల వద్ద ఉన్న పత్రాలను పరిశీలించారు. నిజమైన లబ్ధిదారుల జాబితాను కలెక్టర్‌కు పంపించి వారి ఆదేశాల మేరకు ఇళ్లు కేటాయిస్తామని అధికారులు తెలిపారు.



రహ్మత్‌నగర్ డివిజన్ గాంధీనగర్‌లో పెండింగ్ సివరేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి

సివరేజీ పనులు త్వరగా పూర్తి చేయాలి

యూసుఫ్‌గూడ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్ గాంధీనగర్‌లో పెండింగ్‌లో ఉన్న సివరేజీ పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. చాలా కాలంగా పెండగ్‌లో ఉన్న ఈ పనులు వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పైప్‌లైన్ పనులు పూర్తి అయిన తర్వాత గాంధీనగర్ నుంచి సంజయ్‌నగర్‌కు, గాంధీనగర్ నుంచి ఎన్‌ఎస్‌బీ నగర్‌కు రోడ్ల నిర్మాణ పనులు చేపడతామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

కల్పతరు రెసిడెన్సీ అపార్ట్‌మెంట్స్ ఓనర్స్ సొసైటీ సమావేశం

ఎర్రగడ్డ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని కల్పతరు రెసిడెన్సీ అపార్ట్మెంట్ ఓనర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ మెయింటెనెన్స్ సొసైటీ లిమిటెడ్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు సొసైటీకి ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. గత శనివారం ఉప్పల్ సర్కిల్ అసిస్టెంట్ రిజిస్టర్ బి.అంజనేయులు గతంలో ఉన్న అడ్‌హక్ కమిటీని రద్దు చేస్తున్నట్లు, తదుపరి ఎన్నికల నిర్వహణ కోసం నిర్ణయం తీసుకోవడానికి ఈ నెల 14వ తేదీన సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి నోటీసులు జారీ చేశారని తెలిపారు. ఈ సమావేశం సొసైటీలోని క్లబ్ హౌస్‌లో 14వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఇందులో గత అడ్‌హక్ కమిటీ సభ్యులతో పాటు అపార్ట్మెంట్స్ వాసులు కూడా పాల్గొనాలని వారు సూచించారు. ఈ సమావేశంలో అపార్ట్‌మెంట్స్ వాసులు, అడ్‌హక్ కమిటీ సభ్యులు న్యాయవాది ఏఎస్ విజయకుమార్, సి.శ్రీలక్ష్మి, భాస్కర్‌రెడ్డి, నటరాజ్, సంతోష్‌గుప్తా, మమత, రాఘవేంద్ర, ఎస్.వైశాలి తదితరులు పాల్గొన్నారు.

మోహన్ కుటుంబానికి రూ.86,600 సాయం

అమీర్‌పేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన భవనాశి మోహన్ కుటుంబానికి రూ.86,600 సాయాన్ని అమీర్‌పేట వాసవీ క్లబ్, సనత్‌నగర్ ఆర్యవైశ్య సంఘం నిర్వాహకులు మంగళవారం అందజేశారు. భవనాశి మోహన్ కూతురు భవనాశి కేదారి ప్రియ పేరుపై మంగళవారం పోస్ట్ ఆఫీస్ ఖాతాలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి సంబంధిత పత్రాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ సభ్యులు మురారి శెట్టి సత్యనారాయణ, సింగారపు శ్రీనివాస్ గుప్తా, బిజ్జాల శివశంకర్, వెంకట నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న జూబ్లీహిల్స్ బీజేపీ నాయకులు బరిగెల జ్ఞానేశ్వర్, పులిరామ్, బడుగు సతీష్, ఫానిల్‌కుమార్, విష్ణు తదితరులు

- యూసుఫ్‌గూడ, జూలై 2 (ఆంధ్రజ్యోతి)

బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

● ఎమ్మెల్యే దానం నాగేందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్, జూలై 2(ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఖైరతాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న దేవాలయాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచించారు. బోనాలను పురస్కరించుకొని మంగళవారం ఆయన నివాసంలో జలమండలి, జీహెచ్ఎంసీ, ఎండోమెంట్, పోలీసు, శానిటేషన్, ఎంటమాలజీ, వీధి దీపాల విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దేవాలయాల కమిటీల ద్వారా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆలయాల వద్ద రోడ్లు, వీధి దీపాలు లేకపోవడంతో ఉత్సవాల ఏర్పాట్లు చేయలేకపోతున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ పొంగిపొర్లుతుందని మురుగు నీటిలో వేడుకలు ఎలా జరుపుకోవాలని ప్రశ్నించారు. సమస్యలు చెప్పేందుకు అధికారులకు ఫోన్ చేసినా స్పందించడం లేదని వారు వాపోయారు. ఈ సందర్భంగా దానం అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బస్తీవాసుల నుంచి వచ్చే ఫిర్యాదులను అధికారులు సరిగ్గా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. అధికారులు పట్టించుకోకపోతే సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఆలయ కమిటీల సభ్యులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ డీసీలు జగన్, ప్రశాంతి, తహసీల్దార్ అనితా రెడ్డి, జలమండలి సీజీఎం ప్రభు, జీఎం హరి శంకర్, ఈఈలు విజయ్ కుమార్, ఇందిర, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మామిడి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు: ఎమ్మెల్యే మాగంటి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

ఎర్రగడ్డ, జూలై 2(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆదేశించారు. ఎర్రగడ్డ సుల్తాన్ నగర్‌లోని షంషీర్ ఫంక్షన్‌హాల్‌లో ప్రజా సమస్యలపై శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్లోని చాలా బస్తీలలో ఇప్పటికీ మంచినీటి పైపులైన్లలో మురుగునీరు సరఫరా అవుతుందని అన్నారు. కొన్ని బస్తీలలో సీసీ రోడ్లు, సివరేజీ పైప్ లైన్లు, విద్యుత్, మంచినీటి సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ సందర్భంగా పలు బస్తీలలోని సంక్షేమ సంఘం నాయకులు, స్థానికులు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ఇస్లావత్‌నాయక్, వాటర్ వర్క్స్ డీజీఎం వాహబ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చరలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్, వాటర్ వర్క్స్ మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు నరాజ్‌చికుమార్, శ్రీనివాస్, బాలరాజ్, గిరిధర్‌రావు, సరస్వతి, ప్రేమ్‌చికుమార్, మల్లికార్జున్, ఎర్రగడ్డ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ ప్రెసిడెంట్ డి.సంజీవ్, నాయకులు జి.రాము ఎండీ షరీఫ్, షేక్ జావీద్, సయ్యద్ రసూల్, ఎండీ అజీమ్, బాబ్ జానీ, కళ్యాణి, బాలు, దాసి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గీతంలో ఎంబీఏ హెల్త్ కేర్ అండ్ హాస్పిటల్ మెనెజ్‌మెంట్ కోర్సు

పటాన్‌చెరు రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఎంబీఏ హెల్త్ కేర్ అండ్ హాస్పిటల్ మేనెజ్‌మెంట్ కోర్సును ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ (ఏఎంటీజెడ్), అకాడమీ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్(ఏహెచ్ఏ)ల సంయుక్త సహకారంతో ఈ కోర్సును ప్రారంభించినట్టు కోర్సు సమన్వయకర్త డాక్టర్ ఐ.బీ.రాజు మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించారు. కోర్సు వ్యవధి రెండేళ్లు అని, 2024-25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు గీతం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం గీతం వెబ్‌సైట్‌ను గానీ, ఫోన్ నం.9494656677లో గాని సంప్రదించాలని కోరారు.

సాగర్‌లో ఐదెకరాల భూమిని కేటాయించండి

● నీటి పారుదలశాఖకు శ్రీ రామచంద్ర మిషన్ విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్‌లో హార్ట్‌ఫుల్‌నెస్ యోగా శిక్షణ, ఆధ్యాత్మిక విద్యాకేంద్రానికి ఐదెకరాల భూమి కేటాయించాలని శ్రీ రామచంద్ర మిషన్ నీటిపారుదలశాఖను కోరింది. ఎకరానికి ఏడాదికి రూ.10 వేల చొప్పున పదేళ్ల కాలానికి గాను లీజుకు ఇవ్వాలని స్థానిక అధికారులకు నివేదించింది. అయితే, 2012లో ప్రభుత్వ భూముల లీజులపై విడుదలైన జీవో నం.571 ఆధారంగా ఐదెకరాలకు రూ.24.20 లక్షలను వార్షిక లీజుగా నిర్ధారించాలని స్థానిక అధికారులు ప్రతిపాదనలు పంపగా.. స్వచ్ఛంద సేవ జాబితాలో భూమిని ఎకరానికి రూ.10 వేల చొప్పున ఏడాదికి లీజుకు ఇవ్వాలని సంస్థ నివేదించింది. దాంతో దీనిపై ప్రభుత్వస్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే నాగార్జున సాగర్‌లో 7,289 గజాల స్థలాన్ని శ్రీ రామచంద్ర మిషన్ 1980లో లీజుకు తీసుకుంది. తాజాగా మరో ఐదెకరాల స్థలం కావాలని కోరగా, దీనిపై తగిన నిర్ణయం తీసుకోవాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

బీరు బాటిల్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు

● వైన్స్ నిర్వాహకులతో వాగ్వాదం



బీరు సీసాలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు

మెండోర రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా మెండోర మండల కేంద్రానికి చెందిన తక్కుల సాయిరెడ్డి మంగళవారం స్థానికంగా ఉన్న వైన్స్‌లో కొనుగోలు చేసిన బీరు సీసాలో ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపించాయి. దీంతో వైన్స్ నిర్వాహకుడిని నిలదీశాడు. ఆ బీరు బాటిల్ ఇస్తే మరొకటి ఇస్తానని సిబ్బంది చెప్పడంతో.. ఇలా ఎంత మందిని మోసం చేస్తారని సాయిరెడ్డి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశాడు. ప్లాస్టిక్ వ్యర్థాలను గమనించకుండా బీరును తాగితే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. కాగా.. ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పందించి ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సాయిరెడ్డి డిమాండ్ చేశాడు.

అండర్ టేకింగ్ ఇస్తే లోపాలన్నీ సరి..!

● ఇంజనీరింగ్ కాలేజీల అఫిలియేషన్లకు జేఎన్‌టీయూ లైన్ క్లియర్

● కంప్యూటర్‌సైన్స్ కోర్సుల్లో ఈ ఏడాదికి సీట్ల పెంపు లేనట్లే



హైదరాబాద్ సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ రేపటినుంచి ప్రారంభం కానుండడంతో, త్వరితగతిన అఫిలియేషన్ ప్రక్రియ పూర్తిచేసే పనిలో జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు. డెఫిషియన్సీ ఉన్న కళాశాల యాజమాన్యాలు అండర్ టేకింగ్ ఇస్తే సరిపోతుందంటూ.. సోమవారం రాత్రి వర్సిటీ రిజిస్ట్రార్ సర్క్యులర్ జారీ చేశారు. ఆరునెలల్లోగా తమ కాలేజీల్లో ప్రిన్సిపాల్స్, ఫ్యాకల్టీ కొరతను అధిగమిస్తామని, లేనిపక్షంలో జేఎన్టీయూ అధికారులు చర్యలు చేపట్టవచ్చనే విధంగా రూపొందించిన ఫార్మాట్‌ను సర్క్యులర్‌కు జతచేశారు.

రూ.100 బాండ్‌పేపర్లపై అండర్‌టేకింగ్

రూ.100ల బాండ్‌పేపర్‌పై కళాశాల ఛైర్మన్, సెక్రటరీల సంతకాలతో మంగళవారం సాయంత్రం 4గంటల్లోగా అండర్‌టేకింగ్ పత్రాలను సమర్పించాలని సూచించారు. జేఎన్‌టీయూ అధికారులు ఇచ్చిన వెసులుబాటుతో ఊపిరిపీల్చుకున్న ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాల ప్రతినిధులు ఆగమేఘాల మీద యూనివర్సిటీకి వచ్చి అండర్‌టేకింగ్ పత్రాలు సమర్పించారు. అయితే.. వర్సిటీ అధికారులు పేర్కొన్న లోపాలను అండర్‌టేకింగ్‌లో ప్రస్తావించకుండా, కొన్ని కాలేజీల యజమాన్యాలు తమకు ఫ్యాకల్టీ కొరత అంతగా లేదంటూ సమర్పించిన అఫిడవిట్లను జేఎన్‌టీయూ అధికారులు తిరస్కరించారు. మొత్తంగా 139 కాలేజీల్లో 122 కాలేజీలకు అఫిలియేషన్ మార్గం సుగమం అయినట్లు తెలిసింది. మరో 17 కాలేజీలు సవరించిన అండర్‌టేకింగ్ పత్రాలు సమర్పించేందుకు బుధవారం వరకు గడువు కోరినట్లు తెలిసింది.

ఈ ఏడాదికి సీఎస్‌ఈ సీట్ల పెంపు లేనట్లే.!

ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఈ విద్యా సంవత్సరంలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్‌ఈ) కోర్సులో సీట్ల పెంపులేనట్లేనని జేఎన్టీయూ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే, డిమాండ్ ఉన్న సీఎస్‌ఈ కోర్సుల్లో దాదాపు అన్ని కళాశాలలు ఈ ఏడాది పెద్దమొత్తంలో సీట్ల పెంపునకు ఏఐసీటీఈ నుంచి అనుమతి తెచ్చుకున్నాయి. కాగా, ఇటీవల జేఎన్‌టీయూ నిర్వహించిన ఎఫ్ఎఫ్‌సీ తనిఖీల్లో ఆయా కాలేజీల్లో ప్రిన్సిపాల్స్, ఫ్యాకల్టీ కొరత స్పష్టంగా వెల్లడి కావడంతో సీట్ల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం విముఖత చూపుతున్నట్లు సమాచారం. మరోవైపు కోర్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లైన సివిల్, మెకానికల్ కోర్సుల్లో సీట్లను తగ్గించుకున్న కాలేజీలు, అదే సంఖ్యలో సీఎస్‌ఈ సీట్లను పెంచాలని చేసిన విజ్ఞప్తిని కూడా విద్యాశాఖ ఉన్నతాధికారులు తోసిపుచ్చినట్లు తెలిసింది. దీంతో ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో గతేడాది ఎన్ని సీట్లు ఉన్నాయో, ఈ విద్యా సంవత్సరం కూడా అదే ఇన్‌టేక్‌తో కౌన్సెలింగ్ వెళ్లకతప్పడం లేదని కళాశాలల యాజమాన్యాల సంఘం ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

● సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

● జాజుల శ్రీనివాస్‌గౌడ్



అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు

రాంనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షను రద్దుచేసి, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్‌యాదవ్ ఆధ్వర్యంలో అఖిలపక్ష విద్యార్థి సంఘాల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. నీట్‌పరీక్ష నిర్వహించిన ఏజెన్సీని రద్దు చేయాలని, ప్రశ్నాపత్రాల లీకేజీలకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశ విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన అంశంపై ఇప్పటివరకు ప్రధాని మోదీ నోరు విప్పకపోవడం దుర్మార్గమైనచర్య అని అన్నారు. సీబీఐ దర్యాప్తు పేరుతో ఈ అంశాన్ని మరుగునపడేసే ప్రయత్నాలను ప్రధాని మోదీ చేస్తున్నారని ఆరోపించారు. నీట్ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం పోరాటం చేస్తుందని ఆయన తెలిపారు.

రేపు విద్యాసంస్థల బంద్

నీట్‌పరీక్ష పత్రం లీకేజీ ఘటనలో కేంద్రంలోని బీజేపీ నేతల హస్తం ఉందని, అందుకే ప్రధాని మోదీ నోరు విప్పడం లేదని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. నీట్‌పై జాతీయస్థాయిలో ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఇందులో భాగంగా ఈ నెల 4న ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని బల్మూరి వెంకట్ పిలుపునిచ్చారు. సమావేశంలో డాక్టర్ విజయ్‌భాస్కర్, విద్యార్థి సంఘాల నాయకులు తాటికొండ విక్రమ్‌గౌడ్, అరుణ్, ఆజాద్, నర్సింహానాయక్, లక్ష్మణ్, శాంతికుమార్‌తోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో చోరీ

● వాహనాన్ని వదిలేసి పారిపోయిన దొంగలు

● రూ.8 లక్షల విలువైన సామగ్రి మాయం

పేట్‌బషీరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో దొంగతనానికి యత్నించిన ముగ్గురు దుండగులను పట్టుకునేందుకు ప్రయత్నించేలోపే పారిపోయారు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్‌లో నివాసం ఉంటున్న సత్యనారాయణ, నాగబాబులు దూలపల్లి పారిశామికవాడ రామిరెడ్డినగర్‌లో శ్రీదుర్గా ఇన్‌ఫ్రా కంపెనీ, మహాలక్ష్మి సిందూర్ ఎంటర్ ప్రైజెస్ పేర్లతో పరిశ్రమలు నిర్వహిస్తున్నారు. గతనెల 24, 30న పరిశ్రమల్లోని కాపర్ కేబుల్, వెల్డింగ్ మిషన్లు, డైనింగ్ మిషన్లు, ఆక్సిజన్ ఎల్‌పీజీ సిలెండర్లు చోరీకి గురయ్యాయి. ఈనెల 1వ తేదీ రాత్రి టీఎస్ 13 ఈవై 6122 నెంబరు గల యాక్టివాపై ముగ్గురు వ్యక్తులు పరిశ్రమ వద్దకు వచ్చి సామగ్రిని దొంగిలించేందుకు ప్రయత్నించగా అక్కడే కాపుకాసిన ఆనంద్‌కుమార్, సోనూ కుమార్, బిట్టు, మధులు వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. దీంతో ముగ్గురు దొంగలు యాక్టివాను అక్కడే వదిలేసి పారిపోయారు. ఆ తర్వాత పరిశ్రమ యాజమాన్యం సత్యనారాయణ, నాగబాబులు రూ.8 లక్షల విలువ చేసే సామగ్రి చోరీకి గురయిందని పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దొంగల కోసం సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులు పరిశ్రమ దగ్గరకు వచ్చి పని ఉందా అని యాజమాన్యాన్ని అడగడానికి వచ్చారు. సీసీ కెమెరాల్లో గుర్తించిన వీరిని యాజమాన్యం మాటల్లో పెట్టి పేట్‌బషీరాబాద్ పోలీసులకు సమాచారాన్ని అందించారు. పోలీసులు వచ్చి ఇద్దరు దొంగలను అరెస్ట్ చేశారు.

అంతర్జాతీయ సదస్సుకు డాక్టర్ జగన్మోహన్ సిద్ధ



పంజాగుట్ట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ అలయన్స్ ఫర్ హెల్త్, ఫిజికల్ ఎడ్యుకేషన్, డాన్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో జపాన్ రాజధాని టోక్యోలో జరుగనున్న రెండో ప్రపంచ కాంగ్రెస్ అంతర్జాతీయ సదస్సులో ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జగన్మోహన్ సిద్ధ పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నారు. ఈ నెల 5 నుంచి 8వరకు టోక్యోలోని గాక్గెయి యూనివర్సిటీలో ఈ సదస్సు జరుగనుంది. ఈ సదస్సులో ఉస్మానియా యూనివర్సిటీ కబడ్డీ ఆటగాళ్లలో వేగాన్ని ప్లయోమెట్రిక్ ఎక్సర్‌సైజ్ ద్వారా ఎలా పెంపొందించాలనే అంశంపై ఆయన ప్రసంగించనున్నారు.

పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో రూ.49.5వేలు కాజేశారు

యూసుఫ్‌గూడ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో నగరానికి చెందిన ఓ యువకుడి వద్ద సైబర్ నేరగాళ్లు రూ.49,500 కాజేశారు. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్‌కు చెందిన ముద్దాల సతీష్ కుమార్ ప్రైవేట్ ఉద్యోగి. గత నెల 10న ఆన్‌లైన్ పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో వాట్సాప్‌ఎకు మెసేజ్ వచ్చింది. ఆ మెసేజ్ చదివి లింక్ ఓపెన్ చేశాడు. వారు సూచించిన ఉత్పత్తులకు రేటింగ్ ఇచ్చాడు. దీంతో అతనికి ఆన్‌లైన్‌లో రూ.180 పంపారు. ఆ తర్వాత వివిధ టాస్కుల పేరుతో రూ.500, రూ.730, రూ.2000, రూ.3000 పంపమన్నారు. ఆ నగదు పంపిన తరువాత రూ.6,360 తిరిగి పంపారు. తర్వాత మరో టాస్క్ పేరుతో రూ.49,500 పంపాలని కోరారు. అతను రెండు దఫాలుగా నగదు పంపాడు. ఆ తరువాత ఎలాంటి సమాధానమూ రాలేదు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అద్దెకు కెమెరాలు తీసుకుని మోసం

యూసుఫ్‌గూడ, జూలై 2(ఆంధ్రజ్యోతి): అద్దెకు కెమెరాలు తీసుకుని తిరిగి ఇవ్వకుండా మోసం చేసిన వ్యక్తిపై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంజనీర్స్ కాలనీలో నివాసముండే ఎస్.క్రాంతికుమార్ కెమెరాలు అద్దెకు ఇస్తాడు. ఏప్రిల్ 10న రితిక్‌కుమార్ జైన్ కెమెరాలు అద్దెకు కావాలని కోరాడు. జూలై 1న కెమెరాలతో పాటు అద్దె ఇస్తానని నమ్మించాడు. దీంతో క్రాంతికుమార్ రూ.59లక్షల ఖరీదు చేసే 9 కెమెరాలు, రూ.19.90లక్షల ఖరీదు చేసే 15లెన్స్, రెండు గింబల్స్‌ను అద్దె ప్రాతిపదికన అతను తీసుకెళ్లాడు. అయితే, జూలై 1న క్రాంతికుమార్ ఎన్నిసార్లు ఫోన్ చేసినా రితిక్‌కుమార్ జైన్ స్పందించకపోవడంతో అతని గురించి విచారించాడు. అతను ఆ కెమెరాలను వేరేవారికి అద్దెకు ఇచ్చాడని, వారు అతని లావాదేవీల కారణంగా తిరిగి ఇవ్వలేదని, కొన్నింటిని అమ్మేశాడని తెలిసింది. దీంతో మోసపోయానని గ్రహించిన క్రాంతికుమార్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్ధనగ్న ఫొటోలతో బెదిరింపులు

● మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన యువతి

యూసుఫ్‌గూడ, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై స్నేహితుడిగా నటించిన వ్యక్తి యువతి అర్ధనగ్న ఫొటోలను సేకరించి సామాజిక మాధ్యమంలో పెడతానని బెదిరిస్తున్న సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్ ప్రాంతానికి చెందిన ఓ యువతికి ఇన్‌స్టాగ్రామ్‌లో జోష్ హనుమంత్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. వీరి పరిచయం స్నేహంగా మారడంతో ఇద్దరు ఫోన్ నంబర్లు మార్చుకున్నారు. గత నెల 25న ఆ యువతికి అర్జెంట్ అవసరం ఉండడంతో జోష్ హనుమంత్‌ను రూ.5వేలు ఇవ్వమని అడిగింది. జూలై 1న డబ్బులు తిరిగి ఇచ్చేస్తానని ఆమె చెప్పడంతో రెండు దఫాలుగా డబ్బు పంపించాడు. తర్వాత అసభ్యకర మెసేజ్ పంపాడు. ఆ రాత్రికి వీడియోకాల్ చేసి అర్ధనగ్నంగా మాట్లాడాలంటూ బలవంత పెట్టాడు. ఆ యువతి అలాగే మాట్లాడటంతో వీడియో, స్క్రీన్‌షాట్‌లు తీసుకున్నాడు. ఆ యువతి 1వ తేదీన అతనికి డబ్బులు తిరిగి ఇచ్చేసింది. అయినా, ఫోన్‌లు చేసి అసభ్యకరంగా మాట్లాడుతుండడంతో ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో 'నీ అర్ధనగ్న ఫొటోలు ఇన్‌స్టాగ్రామ్‌లో పెడతా' అంటూ అర్ధనగ్న ఫొటోలను ఆమె ఫోన్‌కు వాట్సాప్ చేశాడు. దీంతో విసిగిపోయిన ఆ యువతి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొబైల్ షాపును ధ్వంసం చేసిన ఏడుగురి అరెస్ట్

అమీర్‌పేట, జూలై 2(ఆంధ్రజ్యోతి): మొబైల్ షాపులో దూరి విధ్వంసానికి పాల్పడిన ఏడుగురు యువకులను ఎస్ఆర్‌నగర్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అమీర్‌పేట ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కూకట్‌పల్లికి చెందిన నికేశ్‌కుమార్ ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో ఆర్‌టీసీ పేరుతో మొబైల్ రిటేల్, రిపేరింగ్ షాపును నడిపిస్తున్నాడు. ఇతనికి పరిచయమున్న కూకట్‌పల్లికి చెందిన అఖిల్ కూకట్‌పల్లిలో మొబైల్ రిటేల్‌షాపు నడిపిస్తున్నాడు. పదిరోజుల క్రితం నికేశ్‌కుమార్ కొన్ని సెల్‌ఫోన్లను రిపేర్ కోసం అఖిల్‌కు ఇచ్చాడు. వీటి విషయమై సోమవారం ఫోన్‌లో గొడవపడి ఇద్దరూ తిట్టుకున్నారు. దీంతో కోపోద్రిక్తుడైన అఖిల్ ఆరుగురు యువకులను వెంటేసుకుని వచ్చి నికేశ్‌కుమార్ మొబైల్ షాపులో దూరి విధ్వంసానికి పాల్పడ్డాడు. అడ్డుకోబోయిన షాపు నిర్వాహకుడితో పాటు మరో ఇద్దరు యువకులపై దాడి చేశారు. నికేశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అఖిల్‌తో పాటు సాయికుమార్, రాజశేఖర్, నవీన్, ప్రసాద్, రాధాకృష్ణ, నిఖిల్ రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

గంజాయి తాగుతున్న ముగ్గురి అరెస్ట్

బంజారాహిల్స్, జూలై 2(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వెలుపల గంజాయి తాగుతున్న ముగ్గురిని ఫుట్ పెట్రోలింగ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పార్కును ఆనుకొని ఉన్న జీహెచ్ఎంసీ వాక్‌వేలో మంగళవారం పోలీసు సిబ్బంది సాయిరాం, బాలయ్య, సుమన్, నరేష్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా గంజాయి తాగుతున్నట్లు తేలింది. ప్రశ్నించగా వారు ఢిల్లీకి చెందిన శివ, నిజామాబాద్‌కు చెందిన సాయి మరో మైనర్ ఉన్నాడు. వారిని బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించారు.

మద్యం తాగొద్దన్నందుకు వ్యక్తి ఆత్మహత్య

బంజారాహిల్స్, జూలై 2(ఆంధ్రజ్యోతి): మద్యం తాగొద్దన్నందుకు ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వనపర్తి జిల్లాకు చెందిన నరేందర్‌రెడ్డి, హైమావతి భార్యాభర్తలు. నరేందర్‌రెడ్డి తెలుగు సినిమా డ్రైవర్ అసోసియేషన్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. నరేందర్‌రెడ్డి మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 1న మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో ఇంట్లో కుటుంబసభ్యులు మద్యం తాగొద్దని వారించారు. కొద్ది సేపటికి ఎవరి పనులపై వారు బయటకు వెళ్లారు. తిరిగి వచ్చేసరికి నరేందర్ ఇంట్లో ఉరేసుకొని కనిపించాడు. అతన్ని కిందకుదించి ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఫిలింనగర్ పోలీసులు 194 బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



తనిఖీలు చేస్తున్న ఆర్‌టీఏ, ట్రాఫిక్ పోలీసులు

ఆరు బస్సులు.. ఐదు ఆటోలు సీజ్

హైదరాబాద్ సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఉల్లంఘిస్తోన్న వాహనాలపై చర్యలకు అధికారులు శ్రీకారం చుట్టారు. మంగళవారం నగరంలోని పలుప్రాంతాల్లో ఆర్‌టీఏ, ట్రాఫిక్ పోలీస్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని మూడు, అనుమతి లేని కారణంగా ఒకటి, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ లేని రెండు పాఠశాలల బస్సులతో కలిపి మొత్తం ఆరు బస్సులను సీజ్ చేశారు. పరిమితికి మించి విద్యార్థులను పాఠశాలలకు తీసుకెళ్తోన్న ఐదు ఆటో రిక్షాలు, లైఫ్‌ట్యాక్స్ చెల్లించకుండా తిరుగుతోన్న ఇతర రాష్ట్రాలకు చెందిన ఓ వాహనం, మరో ఓమ్ని బస్సును సీజ్ చేసినట్టు హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చిదుర రమేష్ తెలిపారు.



చెక్కును అందజేస్తున్న ఎస్సీఆర్ఎంయు జనరల్ సెక్రెటరీ శంకర్‌రావు, అధ్యక్షుడు చిలుకు స్వామి,

బాధిత కుటుంబానికి రూ.11.69లక్షల చెక్కు అందజేత

రెజిమెంటల్‌బజార్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యుడైన అనిల్ కుటుంబ సభ్యులకు ఎంబీఎఫ్ సస్పెండ్ అమౌంట్ చెక్కును ఎస్సీఆర్ఎంయు జనరల్ సెక్రెటరీ శంకర్ రావు, సొసైటీ అధ్యక్షులు చిలుకు స్వామి మంగళవారం కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు స్వామి మాట్లాడుతూ...సొసైటీలో సభ్యత్వం ఉండి మృతి చెందినవారి కోసం పెండింగ్‌లో ఉన్న ఫండ్‌ను వారి కుటుంబాలకు అందిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజుల క్రితం సభ్యుడు చంద్రశేఖర్ కుటుంబ సభ్యులకు రూ.5,20,537 అందించినట్లు తెలిపారు. మంగళవారం అనిల్ కుటుంబ సభ్యులకు రూ.11,69,868 చెక్కును అందజేసినట్లు తెలిపారు. సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫండ్‌ను కొత్త బోర్డు నియామకం తరువాత ప్రత్యేక చర్యలు తీసుకుని అంజేస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఎంబీఎఫ్ ఫండ్‌ను మిగతా సభ్యుల కుటుంబాలకు వీలయినంత త్వరగా అందజేయడానికి కృషిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రామ్మోహన్ పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

సికింద్రాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రసూల్‌పురా ఇందిరమ్మనగర్‌లో మంగళవారం జరిగిన భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన కార్యక్రమం ఆసక్తికరంగాసాగింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నిధులతో నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ, కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్‌లు ప్రారంభిస్తూ వారిద్దరూ చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని కలిగించాయి. తొలుత రామకృష్ణ మాట్లాడుతూ 40లక్షల కంటోన్మెంట్ బోర్డు నిధులతో చేపట్టిన ఈ పనుల వలన చుట్టుపక్కల బస్తీలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. స్థానిక శాసనసభ్యుడు శ్రీగణేష్ చొరవ చూపి, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి నిధులు సాధిస్తారని ఆశిస్తున్నానని వ్యాఖ్యానించారు. దీనికి శ్రీగణేష్ స్పందిస్తూ బోర్డు పాలకమండలి సభ్యులు ప్రారంభించిన అభివృద్ధి పనుల్లో నాణ్యతలోపిస్తోందని అన్నారు. కంటోన్మెంట్‌లో నివసిస్తున్న నిపుణులైన ఇంజనీర్లు, మాజీ ఇంజనీర్లు ముందుకు రావాలని, నాణ్యత ప్రమాణాలతో కూడిన పనులు జరిగేలా సూచనలు చేయాలని కోరారు.

పద్మారావునగర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మామిడి బాల్‌రెడ్డి



మామిడి బాల్ రెడ్డి



ఎం.డి.లాయక్

పద్మారావునగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సికిందరాబాద్, పద్మారావునగర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి ఈనెల 30వ తేదీన నిర్వహించిన ఎన్నికల్లో నూతన కార్యవర్గం ఎన్నికైనట్లు ఎన్నికల కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కమిటీకి అధ్యక్షుడిగా మామిడి బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.డి. లాయక్, ఉపాధ్యక్షులుగా ఇ.చక్రధర్ యాదవ్, కాపర్తి శ్రీనివాస్,ఎం.విజయ్‌కుమార్, జోషీలా ఎమ్మా, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా కె.మధుసూదన్‌రెడ్డి, కోశాధికారిగా కె.కుషాల్, సంయుక్త కార్యదర్శులుగా ఎం.రమేశ్‌కుమార్, ఎన్.బి.భాస్కర్ గుప్తా, టి.వి.గిరి, జి.వివేక్, ఎన్.సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా ఎ.అంజయ్య,ఎం.అజయ్‌కుమార్, వడ్ల మల్లేశ్‌చారి, డి.రమేశ్, జగన్‌రెడ్డి, రాజు సుంకర, వై.సూర్యప్రకాశ్, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, మహ్మద్‌ఖాజా, కె.రాజు, ఇ.శ్రీనివాస్, టి.వెంకటరమణ, సలహాదారులుగా జి.కె.రావు, కె.నిరంజన్‌రావు, మహ్మద్ అరీఫ్, ఇ.చంద్రశేఖర్, కృష్ణారావులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ పదవీ కాలం మూడు సంవత్సరాలు.

లిఫ్టు గుంతలో పడి పూజారి మృతి



లిఫ్టు కింద మృతి చెందిన పూజారి

అడ్డగుట్ట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో దశకర్మ పూజకు వచ్చిన పూజారి లిఫ్టు గుంతలో పడి మృతి చెందిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ అంబటి ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈస్ట్ మారేడుపల్లి టీచర్స్ కాలనీకి చెందిన నర్సింహమూర్తి (55) మారేడుపల్లిలో ఓ ఇంట్లో దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చాడు. రెండో అంతస్తుకు వెళ్లాల్సి ఉండగా గ్రౌండ్‌ఫ్లోర్‌లో లిఫ్టు వద్దకు వచ్చాడు. లిఫ్టుపై అంతస్తులో ఉన్న విషయాన్ని గమనించకుండా బలవంతంగా గేటు తెరిచేందుకు ప్రయత్నించాడు. ఒక్కసారిగా గేటు బలవంతంగా తెరుచుకోగా చూడకుండా అడుగు ముందుకు వేసి లిఫ్టు గుంతలో తూలి పడిపోయాడు. ఈ క్రమంలో రెండో అంతస్తు నుంచి కిందకు వచ్చిన లిఫ్టు పూజారిపైకి చేరడంతో అతను అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న తుకారాంగేట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఆ ఇంట్లో విషాదఛాయలు అలముకున్నాయి. పూజ కోసం వస్తే ఇలా జరిగిందని మారేడుపల్లివాసులు ఆవేదన వ్యక్తంచేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



తిరుమలగిరి, జులై 2 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని బొల్లారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ రహదారికి ఆనుకుని వున్న తోట ముత్యాలమ్మ దేవాలయం పక్కన అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెంది ఉన్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వయసు 35ఏళ్లు ఉండవచ్చని, చూడడానికి ముస్లిం వ్యక్తిగా ఉన్నట్లు తెలిపారు. సమీపంలోని నిర్మాణం జరుగుతున్న ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికుడిగా భావించినప్పటికీ మృతుడి గురించి ఎలాంటి సమాచారంలేదు. అతిగా మద్యం సేవించి మృతి చెందినట్లు తెలిపారు. దీంతోపాటు ఒంటిపై, నడుముపై బలమైన దెబ్బలు తగిలినట్లు కనిపిస్తున్నాయన్నారు. హత్య చేశారా? అతిగా మద్యం సేవించి మృతి చెందాడా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే స్టేషన్‌లో 20 కిలోల గంజాయి పట్టివేత

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సా నుంచి మహారాష్ట్రకు సరఫరా చేస్తున్న ఇరవై కిలోల గంజాయిని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఒకరిని అరెస్టు చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా బాలుగాన్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఫరీద్ (54) సైకిల్ షాపులో పనిచేస్తున్నాడు. ఒడిస్సా నుంచి 20 కిలోల గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్ర తరలించాల్సి ఉండగా ఒడిస్సా నుంచి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయితో ప్రయాణం చేస్తున్నాడు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు రైలు చేరుకోగానే సికింద్రాబాద్ రైల్వే పోలీసులు రైలులో జీఆర్‌పీ ఎస్సై రమేష్‌తో పాటు కానిస్టేబుళ్ల తనిఖీ చేయగా బి4 కోచ్‌లో ఫరీద్ అనే వ్యక్తి నుంచి 20కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఫరీద్‌ను జీఆర్‌పీ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా, ఒడిస్సా నుంచి తెచ్చిన గంజాయి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో వేచి ఉన్న ఒడిస్సాకు చెందిన సాహు, పాండాలు పోలీసులను చూసి పరారయ్యారు. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు.

కాకాగూడలో కలకలం

- మూడు మూగజీవాలపై కట్టర్‌లతో దాడి
- గంజాయి మత్తులో క్రూరత్వం
- యువకుడి అరెస్ట్



హరీష్



గాయాల పాలైన మూగ జీవాలు



మారేడుపల్లి జూలై 2 (ఆంధ్రజ్యోతి) : గంజాయి మద్యం మత్తులో ఓ యువకుడు మూడు మూగజీవాల (ఆవుల)పై కట్టర్ చాకుతో దాడి చేసిన సంఘటన కార్ఖానా పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కాకాగూడలో నివాసముంటున్న హరీష్ (23) ఎనిమిది కేసుల్లో పాత నేరస్థుడు. జులాయిగా తిరుగుతూ గంజాయికి అలవాటుపడ్డాడు. గంజాయి మత్తులో ఉన్న హరీష్ సోమవారం అర్ధరాత్రి దాటాక కార్ఖానా కాకాగూడలోని వీరాంజనేయస్వామి దేవాలయం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో ఉన్న మూడు ఆవులపై కట్టర్ చాకుతో దాడికి పాల్పడ్డాడు. ఒక ఆవు ముఖంపై, మరొక ఆవు వెనుక భాగం తొడపై, మూడో ఆవు కడుపుపై చాకుతో తీవ్రగాయంచేశాడు. సోమవారం ఉదయం కాకాగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భిక్షపతి కార్ఖానా పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు వెటర్నరీ వైద్యులకు సమాచారం అందించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వాటిని బోయగూడలోని వెటర్నరీ ఆస్పత్రికి తీసుకెళ్లి మెరుగైన చికిత్సను అందించారు. సీసీ ఫుటేజ్ ద్వారా గుర్తించిన పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. దాడిచేసిన వ్యక్తి హరీష్‌ను అరెస్టు చేశారు. ఇతనిపై 325బి ఎస్ఎస్‌సెక్షన్ 11 ఎనిమినల్స్ క్యూరియల్టీ యాక్ట్ సెక్షన్లు నమోదు చేసినట్లు కార్ఖానా పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి నేరుగా కార్ఖానా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి దాడికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్ రామకృష్ణకు సూచించారు. ఆవులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ సీనియర్ నాయకులు డా.వంశతిలక్, విజయానంద్‌లు కోరారు.

నీట్ పరీక్షను రద్దుచేసి..

సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలి

- జాతీయ బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు

రాంనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : నీట్ పరీక్షను రద్దుచేసి, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి ద్వారా న్యాయవిచారణ జరిపించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో అఖిలపక్ష విద్యార్థి సంఘాల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ నీట్‌పరీక్ష నిర్వహించిన ఏజెన్సీని రద్దు చేయాలని, ప్రశ్నా పత్రాలలీకేజీలకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశ విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన అంశంపై ఇప్పటివరకు ప్రధాని మోదీ నోరు విప్పకపోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. సీబీఐ దర్యాప్తు పేరుతో ఈ అంశాన్ని మరుగున పడేసే ప్రయత్నాలను ప్రధాని మోదీ చేస్తున్నారని జాజుల ఆరోపించారు. నీట్ విద్యార్థులకు న్యాయం జరిగేంతవరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం పోరాటం చేస్తుందని ఆయన తెలిపారు.

రేపు విద్యాసంస్థల బంద్

నీట్‌పరీక్ష పత్రం లీకేజీ ఘటనలో కేంద్రంలోని బీజేపీ నేతల హస్తం ఉందని, అందుకే ప్రధాని మోదీ నోరు విప్పడం లేదని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. నీట్‌పై జాతీయస్థాయిలో ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఇందులో భాగంగా ఈనెల 4న ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని బల్మూరి వెంకట్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డాక్టర్ విజయ్‌భాస్కర్, విద్యార్థి సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.వసంత్ కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న న్యాయవాదులు

ఏటీఎం సెంటర్ కోసం స్థలం కేటాయించండి

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి వినతి

అడ్డగుట్ట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ సివిల్ కోర్టు ప్రాంగణంలో ఏటీఎం సెంటర్ కోసం కొంత స్థలాన్ని కేటాయించాలని సికింద్రాబాద్ కోర్టు న్యాయవాదులు ఏఎస్.భాస్కర్, పిట్ల బాలశంకర్‌లు కోర్టు 1వ అదనపు ప్రధాన న్యాయమూర్తితో పాటు సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.వసంత్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోర్టు న్యాయవాదులు మాట్లాడుతూ కోర్టుకు వచ్చే న్యాయవాదులు, క్లయింట్‌లు, మహిళలు, సీనియర్ సిటిజన్లకు అనుకూలమైన బ్యాంకింగ్ సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. కోర్టు ఫీజు, బెయిల్ కోసం కట్టే బెయిల్ బాండ్‌ల కోసం నగదు డ్రా చేయడానికి చాలా దూరం ప్రయాణం చేయాల్సి వస్తుందని గుర్తుచేశారు. న్యాయమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సానుకూలంగా స్పందించారన్నారు.

సంక్షేమ పథకాలు అందేలా కృషి

- ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్



లబ్ధిదారులతో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్ తదితరులు

బౌద్ధనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికీ వివిధ సంక్షేమ పథకాలు అందేలా తనవంతు కృషి చేస్తానని సికింద్రాబాద్ నియోజకవర్గ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. మంగళవారం సీతాఫల్‌మండి మధురానగర్‌కాలనీ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గం ముషీరాబాద్, మారేడుపల్లి మండల పరిధిలో ఐదు డివిజన్లకు చెందిన సుమారు 155మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశామని తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కారిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు గోవర్ధన్ (ముషీరాబాద్), అశోక్ (మారేడుపల్లి), కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాచూరి సునీత, లింగాన్ని ప్రసన్నలక్ష్మి, టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్, యువనాయకుడు తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ కందినారాయణ, నాయకులు సుందర్, జలంధర్‌రెడ్డి, శిల్పాచారి, బెజ్జంకి రాజేష్, టీఆర్‌టీ శేఖర్, అనిల్ పాల్గొన్నారు.

కట్టమైసమ్మ ఆలయానికి ఎమ్మెల్యే ఏడులక్షల విరాళం

ఆషాడబోనాల పండుగను పురస్కరించుకుని చిలకలగూడలోని చారిత్రాత్మక కట్టమైసమ్మ, నల్లపోచమ్మ ఆలయానికి సికింద్రాబాద్ నియోజకవర్గ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావుగౌడ్ ఏడు లక్షల రూపాయల వ్యక్తిగత విరాళాన్ని ప్రకటించారు. ఆలయంలో పంచరంగులకు, వివిధ పనుల నిమిత్తం ఏడులక్షల రూపాయలు ఖర్చు అవుతుందని ఆలయ అధికారులు అంచనా వేశారు. ఆలయ అధికారులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ దృష్టికి తీసుకువచ్చా రు. వెంటనే పనులు ప్రారంభించి బోనాల పండుగ నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులనుఆదేశించారు. కార్యనిర్వహణాధికారి, నిర్వాహకులు, భక్తులు పద్మారావుగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గీతంలో ఎంబీఏ హెల్త్ కేర్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సు

పటాన్‌చెరు రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఎంబీఏ హెల్త్ కేర్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సును ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ (ఏఎంటీజెడ్), అకాడమీ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ (ఏహెచ్ఎ)ల సంయుక్త సహకారంతో ఈ కోర్సును ప్రారంభించినట్లు కోర్సు సమన్వయకర్త డాక్టర్ ఐ.బీ.రాజు మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించారు. కోర్సు వ్యవధి రెండేళ్లు అని, 2024-25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు గీతం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం గీతం వెబ్‌సైట్‌ను గానీ, 9494656677 నంబర్‌లో గాని సంప్రదించాలని కోరారు.

అంతర్జాతీయ సదస్సుకు డాక్టర్ జగన్మోహన్ సిద్ధ



డాక్టర్ జగన్మోహన్ సిద్ధ

పంజాగుట్ట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ అలయన్స్ ఫర్ హెల్త్, ఫిజికల్ ఎడ్యుకేషన్, డాన్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో జపాన్ రాజధాని టోక్యోలో జరుగనున్న రెండో ప్రపంచ కాంగ్రెస్ అంతర్జాతీయ సదస్సులో ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జగన్మోహన్ సిద్ధ పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నారు. ఈనెల 5 నుంచి 8వరకు టోక్యోలోని గాక్షెయి యూనివర్సిటీలో ఈ సదస్సు జరుగనుంది. ఈ సదస్సులో ఉస్మానియా యూనివర్సిటీ కబడ్డీ ఆటగాళ్లలో వేగాన్ని ప్లయోమెట్రిక్ ఎక్సర్‌సైజ్ ద్వారా ఎలా పెంపొందించాలనే అంశంపై ఆయన ప్రసంగించనున్నారు.

అండర్ టేకింగ్ ఇస్తే లోపాలన్నీ సరి..!

- ఇంజనీరింగ్ కాలేజీల అఫిలియేషన్లకు జేఎన్‌టీయూ లైన్ క్లియర్
- కంప్యూటర్‌సైన్స్ కోర్సుల్లో ఈ ఏడాదికి సీట్ల పెంపు లేనట్లే



జేఎన్‌టీయూ పరిపాలనా భవనం

హైదరాబాద్ సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ రేపటినుంచి ప్రారంభం కానుండడంతో, త్వరితగతిన అఫిలియేషన్ ప్రక్రియ పూర్తిచేసే పనిలో జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు. డెఫిషియన్సీ ఉన్న కళాశాల యాజమాన్యాలు అండర్ టేకింగ్ ఇస్తే సరిపోతుందంటూ.. సోమవారం రాత్రి వర్సిటీ రిజిస్ట్రార్ సర్క్యులర్ జారీ చేశారు. ఆరునెలల్లోగా తమ కాలేజీల్లో ప్రిన్సిపాల్స్, ఫ్యాకల్టీ కొరతను అధిగమిస్తామని, లేనిపక్షంలో జేఎన్టీయూ అధికారులు చర్యలు చేపట్టవచ్చనే విధంగా రూపొందించిన ఫార్మట్‌ను సర్క్యులర్‌కు జతచేశారు.

రూ.100 బాండ్ పేపర్లపై అండర్‌టేకింగ్

రూ.100ల బాండ్‌పేపర్‌పై కళాశాల ఛైర్మన్, సెక్రటరీల సంతకాలతో మంగళవారం సాయంత్రం 4గంటల్లోగా అండర్‌టేకింగ్ పత్రాలను సమర్పించాలని సూచించారు. జేఎన్‌టీయూ అధికారులు ఇచ్చిన వెసులుబాటుతో ఊపిరిపీల్చుకున్న ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాల ప్రతినిధులు ఆగమేఘాల మీద యూనివర్సిటీకి వచ్చి అండర్‌టేకింగ్ పత్రాలు సమర్పించారు. అయితే.. వర్సిటీ అధికారులు పేర్కొన్న లోపాలను అండర్‌టేకింగ్‌లో ప్రస్తావించకుండా, కొన్ని కాలేజీల యజమాన్యాలు తమకు ఫ్యాకల్టీ కొరత అంతగా లేదంటూ సమర్పించిన అఫిడవిట్లను జేఎన్‌టీయూ అధికారులు తిరస్కరించారు. మొత్తంగా 139 కాలేజీల్లో 122 కాలేజీలకు అఫిలియేషన్ మార్గం సుగమం అయినట్లు తెలిసింది. మరో 17 కాలేజీలు సవరించిన అండర్‌టేకింగ్ పత్రాలు సమర్పించేందుకు బుధవారం వరకు గడువు కోరినట్లు తెలిసింది.

ఈ ఏడాదికి సీఎస్ఈ సీట్ల పెంపు లేనట్లే.!

ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఈ విద్యా సంవత్సరంలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ) కోర్సులో సీట్ల పెంపులేనట్లేనని జేఎన్టీయూ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే, డిమాండ్ ఉన్న సీఎస్ఈ కోర్సుల్లో దాదాపు అన్ని కళాశాలలు ఈ ఏడాది పెద్దమొత్తంలో సీట్ల పెంపునకు ఏఐసీటీఈ నుంచి అనుమతి తెచ్చుకున్నాయి. కాగా, ఇటీవల జేఎన్‌టీయూ నిర్వహించిన ఎఫ్ఎఫ్‌సీ తనిఖీల్లో ఆయా కాలేజీల్లో ప్రిన్సిపాల్స్, ఫ్యాకల్టీ కొరత స్పష్టంగా వెల్లడి కావడంతో సీట్ల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం విముఖత చూపుతున్నట్లు సమాచారం. మరోవైపు కోర్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లైన సివిల్, మెకానికల్ కోర్సుల్లో సీట్లను తగ్గించుకున్న కాలేజీలు, అదే సంఖ్యలో సీఎస్ఈ సీట్లను పెంచాలని చేసిన విజ్ఞప్తిని కూడా విద్యాశాఖ ఉన్నతాధికారులు తోసిపుచ్చినట్లు తెలిసింది. దీంతో ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో గతేడాది ఎన్ని సీట్లు ఉన్నాయో, ఈ విద్యా సంవత్సరం కూడా అదే ఇన్‌టేక్‌తో కౌన్సెలింగ్ వెళ్లకతప్పడం లేదని కళాశాలల యాజమాన్యాల సంఘం ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు.



తనిఖీలు చేస్తున్న ఆర్‌టీఏ, ట్రాఫిక్ పోలీసులు

ఆరు బస్సులు.. ఐదు ఆటోలు సీజ్..!

హైదరాబాద్ సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఉల్లంఘిస్తోన్న వాహనాలపై చర్యలకు అధికారులు శ్రీకారం చుట్టారు. మంగళవారం నగరంలోని పలుప్రాంతాల్లో ఆర్‌టీఏ, ట్రాఫిక్ పోలీస్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని మూడు, అనుమతి లేని కారణంగా ఒకటి, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ లేని రెండు పాఠశాలల బస్సులతో కలిపి మొత్తం ఆరు బస్సులను సీజ్ చేశారు. పరిమితికి మించి విద్యార్థులను పాఠశాలలకు తీసుకెళ్తోన్న ఐదు ఆటో రిక్షాలు, లైఫ్‌ట్యాక్స్ చెల్లించకుండా తిరుగుతోన్న ఇతరరాష్ట్రాలకు చెందిన ఓ వాహనం, మరో ఓమ్ని బస్సును సీజ్ చేసినట్లు హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చిదుర రమేష్ తెలిపారు.

బీరు బాటిల్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు

- వైన్స్ నిర్వాహకులతో వాగ్వాదం
- బాధ్యులపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్



బీరు సీసాలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు

మెండోర రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా మెండోర మండల కేంద్రానికి చెందిన తక్కల సాయిరెడ్డి అనే యువకుడు మంగళవారం స్థానికంగా ఉన్న వైన్స్‌లో కొనుగోలు చేసిన బీరు సీసాలో ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపించాయి. దీంతో వైన్స్ నిర్వాహకుడిని నిలదీశాడు. ఆ బీరు బాటిల్ ఇస్తే మరొకటి ఇస్తానని సిబ్బంది చెప్పడంతో.. ఇలా ఎంత మందిని మోసం చేస్తారని సాయిరెడ్డి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశాడు. ప్లాస్టిక్ వ్యర్థాలను గమనించకుండా బీరును తాగితే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. కాగా.. ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పందించి ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సాయిరెడ్డి డిమాండ్ చేశాడు.

అక్రమ నిర్మాణం తొలగింపు

రెజిమెంటల్‌బజార్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మోండా డివిజన్ రెజిమెంటల్ బజార్‌లో అక్రమ నిర్మాణం తొలిగించకుండా కాలయాపన చేస్తున్న టౌన్‌ప్లానింగ్ శాఖ తీరుపై ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితం కావడంతో అక్రమ నిర్మాణంను తొలిగించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ స్వయంగా పరిశీలించి ఆదేశించినా చర్యలు తీసుకోకపోవడంపై జూన్ 30వ తేదీన ఆంధ్రజ్యోతి పత్రికలో 'ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతర్' పేరుతో వార్త రావడంతో అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాన్ని తొలిగించారు.

నీట్ పరీక్షా విధానాన్ని రద్దు చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్

తార్నాక, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షా విధానాన్ని రద్దు చేసి ఆయా రాష్ట్రాల్లోని యూనివర్సిటీల ద్వారా పరీక్షలు నిర్వహించేవిధంగా ఏర్పాట్లు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఈమేరకు మంగళవారం ఓయూలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షా ఫలితాలు విడుదలై నెల రోజులు గడుస్తున్నా లీకేజీకి పాల్పడిన నిందితులను శిక్షించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో దేశవ్యాప్తంగా 24లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ అంధకారంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి పేపర్ లీకేజీకి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సాగర్‌లో ఐదెకరాల భూమిని కేటాయించండి

నీటి పారుదల శాఖకు శ్రీ రామచంద్ర మిషన్ విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్‌లో హేర్ట్‌ఫుల్‌నెస్ యోగా శిక్షణ, ఆధ్యాత్మిక విద్యాకేంద్రానికి ఐదెకరాల భూమి కేటాయించాలని శ్రీ రామచంద్ర మిషన్ నీటిపారుదలశాఖను కోరింది. ఎకరానికి ఏడాదికి రూ.10వేల చొప్పున పదేళ్ల కాలానికి గాను లీజుకు ఇవ్వాలని స్థానిక అధికారులకు నివేదించింది. అయితే 2012లో ప్రభుత్వ భూముల లీజులపై విడుదలైన జీవో నెం.571 ఆధారంగా ఐదెకరాలకు రూ.24.20లక్షలను వార్షిక లీజుగా నిర్ధారించాలని స్థానిక అధికారులు ప్రతిపాదనలు పంపగా.. స్వచ్ఛంద సేవ జాబితాలో భూమిని ఎకరానికి రూ.10వేల చొప్పున ఏడాదికి లీజుకు ఇవ్వాలని సంస్థ నివేదించింది. దాంతో దీనిపై ప్రభుత్వస్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే నాగార్జున సాగర్‌లో 7289 గజాల స్థలాన్ని శ్రీరామచంద్ర మిషన్ 1980లో లీజుకు తీసుకుంది. తాజాగా మరో ఐదెకరాల స్థలం కావాలని కోరగా, దీనిపై తగిన నిర్ణయం తీసుకోవాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

రోడ్డు, డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం

రెజిమెంటల్‌బజార్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ బస్తీపర్యటనతో బస్తీలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం లభించింది. పదిహేను రోజుల క్రితం మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్‌లో ఎమ్మెల్యే అధికారులతో కలిసి స్థానిక సమస్యలు తెలుసుకోవడానికి పర్యటించారు. 9-3 లైన్‌లో రోడ్డు తవ్వి పునర్ నిర్మించకుండా వదిలేసిన విషయంతోపాటు, పోచమ్మ గుడి వద్ద డ్రైనేజీ సమస్యను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలతో పోచమ్మ గుడి వద్ద డ్రైనేజీ పైపు లైను లీకేజీని గుర్తించి మరమ్మతు పనులను చేపట్టారు. అదేవిధంగా ఏడాది కాలంగా తవ్విన రోడ్డు పునర్‌నిర్మించకుండా వదిలివేయడంతో వెంటనే రోడ్డు నిర్మాణం పనులను చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించడంతో టెండర్‌లను ఆహ్వానించారు. బుధవారం టెండర్‌లను తెరిచి ఎంపికచేసిన కాంట్రాక్టర్‌కు రోడ్డు నిర్మాణం పనులను అప్పగించనున్నట్లు జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ శాఖ అధికారి తెలిపారు. ఎమ్మెల్యే పర్యటనతో సమస్యలు తీరుతుండటంతో బస్తీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.